సాక్షి
విశాఖపట్నం

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



చేనేత కార్మికులకు సత్కారం

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. 8లో



ప్రథమ స్థానమే లక్ష్యంగా..

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ప్రథమ స్థానమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. 8లో

ఉజ్వల చిత్రాలు..!



ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు దేనిలోనూ తీసిపోరన్న రీతిలో సృజనాత్మకతను రంగరించి అక్కా తమ్ముడు గీస్తున్న చిత్రాలు పలువురిలో ఆలోచన రేకెత్తిస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.7 కోట్లు



లెక్కింపును పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 34 రోజులకు గాను కోటి 70 లక్షల 55వేల 730 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై స్వామివారి ఆలయ బేడామండపంలో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 112.005 గ్రాముల బంగారం, 10.050 కిలోల వెండి లభించినట్లు ఈవో పేర్కొన్నారు. సోమవారం 11 హుండీలను మాత్రమే తెరిచి లెక్కించడం జరిగిందని, మంగళవారం కూడా లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి శ్రావణ సంగీతోత్సవాలు



మాట్లాడుతున్న హిమాంశు ప్రసాద్

ఎంవీపీకాలనీ: శ్రీ వెంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం టీటీడీ కల్యాణ మండపంలో కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణగాథలపై ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోజూ సాయంత్రం 4.30 నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో విద్యార్థులకు డ్రాయింగ్, కీర్తనలు, కథల పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్ తదితరులు

మహారాణిపేట: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో దూర విద్యా విధానం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారందరూ పదో తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. ఏపీ ఓపెన్ స్కూలు ద్వారా ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణులైన వారితోపాటు పాఠశాలల్లో ఎస్ఎస్‌సీ పూర్తి చేసి వివిధ కారణాల వల్ల ఇంటర్మీడియెట్ చదవలేక పోయినవారికి, ఇంటర్ ఫెయిలై చదువు మానేసిన వారికి సార్వత్రిక విద్యావిధానంలో ఇంటర్మీడియెట్ కోర్సును ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, డీఈవో చంద్రకళ, ఆర్ఐవో సత్యనారాయణ పాల్గొన్నారు.

రామానుజ కూటమి నిర్మాణానికి స్థల పరిశీలన

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో రామానుజ కూటమి పునః నిర్మించేందుకు దేవస్థానం ఈవో త్రినాథరావు స్థలపరిశీలన చేశారు. దేవస్థానం వైదికులతో కలిసి దక్షిణ మాడ వీధి తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఆలయంలో విధులు నిర్వర్తించే అర్చకులు సేద తీరేందుకు, స్నానాలు ఆచరించేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు అణుగుణంగా రామానుకూటమి నిర్మాణం చేపట్టనున్నారు.

రూ.88 లక్షలతో శంకుచక్రనామాలు

సింహగిరిపై వైకుంఠనాథుడి మెట్టపై జీఆర్‌టీ జ్యూయలర్స్ రూ.88లక్షలతో భారీ శంకుచక్రనామాల ఏర్పాటు చేయనుంది. ఈమేరకు సోమవారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు జీఆర్‌టీ జ్యూయలర్స్ ప్రతినిధులతో కలిసి వైకుంఠనాథుడి మెట్ట వద్ద పరిశీలన జరిపారు. వంద అడుగుల వెడల్పు, ఐదు అడుగుల ఎత్తు మేర శంకుచక్రనామాలను ఏర్పాటు చేయనున్నారు.

అండగా ఉంటా.. ఆదుకుంటా..





అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో సీఎం సభకు హాజరైన వరద బాధితులు, పోలవరం నిర్వాసితులు, మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎవరూ అధైర్యపడవద్దు, మీకు నేను అండగా ఉంటా.. అందరికీ న్యాయం చేయడం నా బాధ్యత

–ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

మీరే న్యాయం చేస్తారు.. మీరైతేనే న్యాయం చేస్తారు.. రాజన్న బిడ్డపై మాకు అంత నమ్మకం

– ఇది వరద బాధితులు, పోలవరం నిర్వాసితుల విశ్వాసం

- వరద బాధితుల్లో ధైర్యం నింపిన ముఖ్యమంత్రి
- పోలవరం నిర్వాసితులకు గట్టి హామీ
- కూనవరం, వీఆర్‌పురం, చింతూరుల్లో పర్యటన
- నాలుగు గంటలపాటు బాధితులతో గడిపిన వైఎస్ జగన్
- అడుగడుగునా ఆత్మీయ పలకరింపుతో పులకించిన గిరిజనం

సాక్షి, విశాఖపట్నం/చింతూరు: ముఖ్యమంత్రి మాటలు వారిలో కొండంత ధైర్యం నింపాయి. వరదల వల్ల ఏటా మీరు పడుతున్న బాధలను స్వయంగా చూస్తున్నా.. అందుకే లిడార్ సర్వే ద్వారా మరికొన్ని గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో చేర్చి పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పగానే నిర్వాసితులు హర్షధ్వానాలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విలీన మండలాల ప్రజల్లో ఉత్సాహం నింపింది. ఆయన ప్రసంగం వరద బాధితులతోపాటు పోలవరం నిర్వాసితులకు కొండంత భరోసానిచ్చింది. 'నాన్నగారి హయాంలో రూ 1.15 లక్షల పరిహారం ఇచ్చిన రైతుల భూములకు గతంలో నేను చెప్పినట్లుగా రూ.5 లక్షలు ఇస్తాను.. త్వరలోనే మరో రూ 3.85 లక్షలు రైతులకు అందచేస్తాను' అని సీఎం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయం చేసేందుకు మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నాడని, మీకు తప్పకుండా బాధల నుంచి విముక్తి కలిగిస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాటలతో నిర్వాసితుల్లో ఆనందం వెల్లివిరిసింది.

అడుగడుగునా ధైర్యం నింపుతూ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.50 గంటలకు కోతులగుట్ట హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ 20 నిమిషాలపాటు వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ప్రజా ప్రతినిధులతో ముచ్చటించారు. 11.15కు హెలిప్యాడ్ వద్ద నుంచి బస్సులో బయలుదేరి 11.40కు కూనవరం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలు విన్నారు. పరిహారం అందరికీ అందిందా.. అని అడిగారు. లేనిపక్షంలో ఇక్కడికి వచ్చి చెప్పండని ఆహ్వానించారు. దీనిపై స్థానికులు తమకు వరద పరిహారం అందిందని బదులిచ్చారు. అయితే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగా అందించాలని కోరారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ ఇదే విషయాన్ని ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. గోదావరి, శబరి నదుల అనుసంధాన ప్రాంతం కావడంతో బ్యాక్ వాటర్ ఎక్కువగా వచ్చి పంటలు మునుగుతున్నాయని, ఏడాదికి ఒక పంట కూడా వేయలేని పరిస్థితి నెలకొంటుందని, దీనిపై తమకు ప్రభుత్వం సాయం అందించాలని బాధితులు కోరారు. పోలవరం ముంపునకు గురయ్యే పంటలకు సొసైటీల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. సీఎం స్పందిస్తూ వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సభావేదిక వద్ద పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఒక్కో కుటుంబానికి రూ.2 వేల పరిహారంతో పాటు కుటుంబానికి 25 కేజీల ఉచిత బియ్యం ఇచ్చారు. వరద బాధిత గ్రామాలను గతంలో ఎప్పుడూ ఇలా ఆదుకున్నది లేదని బాధితులు మనోగతం వెల్లడించారు. సీఎం అక్కడ నుంచి 1.50 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. 3.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళ్లారు.



నేనున్నాను : భరోసా ఇస్తున్న సీఎం జగన్



చల్లగా ఉండు : అవ్వ దీవెన

కలెక్టర్ బాగా పనిచేశారు

గతేడాది, ఈ ఏడాది వచ్చిన వరదల సమయంలో జిల్లా కలెక్టర్ ఎంతో బాగా పనిచేశారు సార్.. మేము ఇక్కడి నుంచి వెళ్లే వరకు కలెక్టర్ గారు ఈ జిల్లాలోనే ఉండేలా చూడండి సార్.. అంటూ వరద బాధితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అన్నారు. 'వరదలు అడ్డంకిగా ఉన్నందున కలెక్టర్ గారు మా ఊరికి రాలేదు సార్' అని వీఆర్‌పురం మండలం అడవి వెంకన్నగూడేనికి చెందిన మహిళ చెప్పగానే.. వరదలు తగ్గాయి కదా కలెక్టర్ గారూ.. ఒకసారి ఆ ఊరు వెళ్లి రండంటూ ముఖ్యమంత్రి చమత్కరించారు.

దూసుకొచ్చిన మృత్యువు



వేళ్లతో సహా రోడ్డుపై పడిన చెట్టు



డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకొచ్చిన కారు

- అతి వేగంతో రుషికొండ వద్ద అదుపుతప్పిన కారు
- డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులో బైక్, చెట్టును ఢీకొన్న వైనం
- దంపతులతోపాటు యువకుడు దుర్మరణం
- తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో మరొకరికి చికిత్స



ప్రమాద స్థలంలో దంపతుల మృతదేహాలు





కారులో మజ్జి మణికుమార్ మృతదేహం (ఇన్‌సెట్) మణికుమార్ (ఫైల్)

కొమ్మాది / ఎంవీపీ కాలనీ : మద్యం మత్తు... ఆపై అతివేగం... వెరసి మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటనతో ఎటువంటి సంబంధమూ లేని దంపతులు ప్రమాద స్థలిలోనే దుర్మరణం చెందడం చూపరులను కలిచివేసింది. బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన దుర్ఘటనకు సంబంధించి ద్వారకా జోన్ ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఐదుగురు యువకులు కారులో మద్యం సేవిస్తూ సాగరనగర్ నుంచి రుషికొండ వైపు వేగంగా వస్తున్నారు. కారు రాడిసన్ బ్లూ హోటల్ సమీపానికి వచ్చే సరికి వేగాన్ని నియంత్రించ లేకపోవడంతో అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లిన కారు... అదే సమయంలో రుషికొండ నుంచి నగరంలోకి వెళ్తున్న దంపతుల బైక్‌ను... తర్వాత చెట్టును ఢీకొట్టింది. ఈ హఠాత్పరిణామంతో దంపతులు తీవ్ర గాయాలతో ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచారు. కారులో వెనుక సీటులో కూర్చున్న ఓ యువకుడు కూడా మృతి చెందాడు. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న యువకుడితోపాటు ముందు కూర్చున్న మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డారు. కారులో ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో అతని స్నేహితులు కేజీహెచ్‌కు తరలించారు.

అతి వేగం యమపాశమై...

ఏపీ 39 జేవో 9466 నంబరు కారులో బీరు బాటిళ్లు ఉండడంతో అందులోని యువకులు మద్యం సేవించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మద్యం మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లుగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కారులో మరణించిన యువకుడిని పీఎం పాలెంకు చెందిన మజ్జి మణికుమార్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన భార్యభర్తలు రాయగడ ప్రాంతానికి చెందిన సింగారపు పృథ్వీరాజ్ (28), ప్రియాంక్ (21)గా గుర్తించారు. వీరు రుషికొండ నుంచి నగరంలోకి వస్తూ ఈ ప్రమాదంలో మృతిచెందారు. కారులో ప్రయాణించిన వారిలో వినయ్ అనే యువకుడు పరారీలో ఉండగా మిగతా వారు వివరాలు చెప్పే స్థితిలో లేరని పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో కారు వేగం 150 కిలోమీటర్లపైనే వుండొచ్చని అభిప్రాయపడ్డారు. కారు వేగానికి చెట్టు వేళ్లతో సైతం లేచిపోయి పక్కరోడ్డులో పడడంతో ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. మృతదేహాలను అర్ధరాత్రి దాటాక కేజీహెచ్‌కు పోలీసులు తరలించారు. ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, మంగళవారం వివరాలు తెలియజేస్తామని ఏసీపీ మూర్తి వెల్లడించారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గుండెపోటును గుర్తించేలా...

- ఏపీ స్టెమీ ప్రాజెక్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభం
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



ప్రసంగిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : కోవిడ్ తర్వాత వైద్య రంగంలో వివిధ దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా యువకులు గుండెపోటుకు అధికంగా గురవుతున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. అవి చాలా ప్రాణాంతకంగా మారుతున్నాయని, ఇందుకు కచ్చితమైన కారణాలు కనుగొనడం కష్టంగా మారిందన్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టెమీ ప్రాజెక్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. సోమవారం కేజీహెచ్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీ వరకు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆస్పత్రులకు దూరంగా ఉన్న రోగుల్లో గుండెపోటు కారణంగా మరణాలను నివారించడానికి ఏపీ ప్రభుత్వం ఈ స్టెమీ ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. సుదూర ప్రాంతాల్లో, గ్రామీణ సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు 'ఈసీజీ' చేయడం ద్వారా గుండెపోటును గుర్తించడానికి వైద్యులు శిక్షణ పొందుతారని, సమాచారాన్ని కార్డియాలజిస్టులకు పంపడం ద్వారా చికిత్సను సూచిస్తారని తెలిపారు. ఆ తర్వాత సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు గుండె రక్తనాళాల్లో క్లాట్ కరిగించే మందులు ఇంట్రావీనస్ ద్వారా ఇస్తారని, అడ్డంకులు తొలగిపోయి ఛాతి నొప్పి తగ్గుతుందన్నారు. అనంతరం వారు రోగులను కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి పంపిస్తారన్నారు. కేజీహెచ్‌లోని కార్డియాలజీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, కార్డియాలజీ విభాగం, ఏఎంసీ ద్వారా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాధాకృష్ణ, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు మరింత ప్రోత్సాహం



స్టాల్ ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో నేతన్నలను మరింత ప్రోత్సహిద్దామని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్‌ను ఆయన ప్రారంభించి వస్త్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇకపై ప్రతి వారం వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆప్కో ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం కింద మగ్గాల ఆధునికీకరణకు ఒక్కో చేనేత కార్మికుడికి రూ.24 వేలు ఇస్తోందన్నారు. చేనేత జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణమ్మ, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, డీఈవో చంద్రకళ, జె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

పాత గంగవరం తీరంలో యువకుడి గల్లంతు



షేక్ నాగూర్ సాహెబ్ (ఫైల్)

పెదగంట్యాడ: మండలంలోని పాత గంగవరం తీరంలో ఓ యువకుడు సోమవారం గల్లంతయ్యాడు. న్యూపోర్టు సీఐ సువ్వారి రాము తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కరప మండలం కొత్తపేటకు చెందిన షేక్ నాగూర్ సాహెబ్ (24) గాజువాకలోని కుంచుమాంబ కాలనీలో తన అన్నయ్యతో కలసి నివాసం ఉంటున్నాడు. తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను గాజువాక కుంచుమాంబ కాలనీకి చెందిన స్నేహితులు నగిరెడ్డి సతీష్, కిల్లంపల్లి శ్యామ్యూల్, బర్లి నాయుడు, కింతల కనకరాజు (దత్తసాయి నగర్)తో కలసి విహారయాత్రకని పాత గంగవరం తీరానికి వెళ్లారు. సరదాగా స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఒక్కసారిగా పెద్ద అల రావడంతో నాగూర్ సాహెబ్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అతన్ని రక్షించాలని తోటి స్నేహితులు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ రాము సిబ్బందితో కలిసి తీరానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన నాగూర్ సోదరుడు బషీర్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టెనోగ్రాఫర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖలీగల్: జిల్లా వినియోగదారుల మండలి-2లో జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్ట్ భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. డిగ్రీ ఉత్తీర్ణత పొంది స్టెనోగ్రఫీ కోర్సులో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వినియోగదారుల మండలి- 2 న్యాయమూర్తి గేదెల వెంకటేశ్వరి తెలిపారు. దరఖాస్తును వినియోగదారుల మండలి-2 వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, సిరిపురం, విశాఖపట్నం-17కి అందజేయాలన్నారు. వివరాలకు 9885913822కు సంప్రదించాలన్నారు.

సత్వరమే వినతుల పరిష్కారం

'జగనన్నకు చెబుదాం'కు 84 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 84 వినతులు అందాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై అయా విభాగాధిపతులు చేపట్టిన చర్యల వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వాటిని వచ్చే వారం నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ముందుగా సమర్పించాలని సూచించారు. ఇలా చేస్తే నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయో..? తెలుసుకునే వీలుంటుందని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 54 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 54 ఫిర్యాదులు అందాయని సీపీ త్రివిక్రమ్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ అడ్మిన్ ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ ఈ.నాగేంద్రుడు, లీగల్ అడ్వయిజర్ పీవీ రామకృష్ణ ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని డీసీపీ నాగన్న పరిశీలించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారం బాధ్యత అధికారులదే

'జగనన్నకు చెబుదాం' సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' వినతుల పరిష్కారంపై అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను మల్లికార్జున స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే బాధ్యత అధికారులపై ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. మొత్తం 218 మంది నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



వివిధ రకాల పువ్వులతో అలంకరించిన కొత్తమ్మతల్లి విగ్రహం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల దేవత కొత్తమ్మతల్లిని వివిధ రకాల పువ్వులతో సోమవారం సాయంత్రం అలంకరించారు. ఈ అలంకరణకు నందివర్ధనం, పసుపు, ఎరుపు గులాబీ పువ్వులు, బంతిపూల దండలను వినియోగించారు. మంగళవారం ఈ ప్రత్యేక అలంకరణతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అలంకరణకు సామగ్రిని కొత్తపేటకు చెందిన సరగడ అప్పలసూరి, పార్వతి సమకూర్చారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అమ్మవారిని అలంకరించారు.

ఉజ్వల చిత్రాలు..!

- చిత్రకళలో రాణిస్తున్న చిన్నారులు
- వుయ్ లవ్ రీడింగ్‌తో విద్యార్థుల్లో నూతనోత్తేజం



నీరు రీసైక్లింగ్‌పై గీసిన చిత్రం



కుమారుడిని తలచుకుంటూ ఉత్తరం రాస్తున్న అమ్మ చిత్రం



ఉజ్వల్ కుమార్ గీసిన రాష్ట్ర పటం



నీటి సంరక్షణపై గీసిన చిత్రం

విశాఖ విద్య: ఆ చిన్నారులు గీసే బొమ్మలు చూసే వారిలో ఆలోచన కలిగిస్తాయి. ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు సైతం దేనిలోనూ తీసిపోరన్న రీతిలో సృజనాత్మకతను రంగరించి చూడముచ్చటైన బొమ్మలు వేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, పిల్లలపై తల్లిదండ్రులు చూపే ప్రేమ... ఇలా గీసే చిత్రమేదైనా సామాజిక దృక్పథం ఇమిడి ఉంటుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చిత్రకళలో రాణిస్తున్న అక్కా తమ్ముడు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

నగరంలోని సీతమ్మధార గాంధీనగర్ ఏరియాకు చెందిన అక్కా తమ్ముడు బట్టు మహాలక్ష్మి సమీప ఎస్ఎంసీ హైస్కూల్లో ఏడో తరగతి, ఉజ్వల్ కుమార్ మద్దిలపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదుతున్నారు. ఒకటో తరగతి నుంచి మద్దిలపాలెం జీవీఎంసీ స్కూల్లోనే వారి విద్యాభ్యాసం సాగింది. తండ్రి సూర్యనారాయణ ఆటో డ్రైవర్‌గా, తల్లి సత్య ఇంటి వద్దనే ఉంటుంది. చిత్రకళపై పిల్లలకు ఉన్న మక్కువను చూసి, వారికి తగిన ప్రోత్సాహం అందించారు. దేశ నాయకులు, దేవుళ్లు ఇలా అన్ని రకాల బొమ్మలు తక్కువ సమయంలోనే గీస్తున్నారు. స్నేహితుల పుట్టిన రోజున వారిని ఆలోచింపజేసే రీతిలో బొమ్మలు గీసి కానుకగా అందజేస్తుంటారు.

డ్రాయింగ్‌లో తర్ఫీదు

ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా మద్దిలపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభిరుచుల మేరకు చదువులు సాగించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్మార్ట్ టీవీ అందుబాటులో ఉండటంతో చిత్రకళలో నైపుణ్యం ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేలా తగిన ఏర్పాట్లు చేశారు. డ్రాయింగ్‌లో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు వారికి తర్ఫీదు ఇస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలతోనే తమ పిల్లలు అన్నింటా రాణిస్తున్నారని ఉజ్వల్ కుమార్ తల్లి బట్టు సత్య తెలిపింది. ప్రైవేటు స్కూళ్లపై మోజు తప్ప, కనీస సౌకర్యాలు కూడా ఉండవని, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అమ్మ ఒడి డబ్బులు నాలుగేళ్లుగా వస్తున్నాయని, మా ఆయన ఆటో నడుపుతున్నందుకు వాహన మిత్ర పథకం అందుతోందని తెలిపారు. మాలాంటోళ్లకు సీఎం జగనన్న అండగా నిలుస్తుండడంతో పిల్లలను దర్జాగా చదివించుకుంటున్నామని చెబుతోంది.

అందరి ప్రోత్సాహంతో...



చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం అంటే ఎంతో ఇష్టం. బొమ్మ ఎలా గీయాలో అమ్మ నేర్పింది. అక్కతో పోటీ పడి బొమ్మలు గీస్తాను. బొమ్మలు గీసేందుకు క్రేయాన్స్, చార్ట్స్, రంగుల పెన్నులు నాన్న కొనిస్తారు. బడిలో టీచర్లు బాగా ప్రోత్సహిస్తారు. అందుకే మదర్స్ డే, ఫాదర్స్ డే రోజున వారికి నేను వేసిన బొమ్మలే గిఫ్ట్‌గా ఇస్తాను. బడిలో ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు.

– ఉజ్వల్ కుమార్, విద్యార్థి

రోడ్డు ప్రమాదంలో ఇంగ్లిష్ లెక్చరర్ మృతి



రాజశేఖర్ (ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఆల్వార్ దాస్ కళాశాల సమీపంలో బీఆర్‌టీఎస్ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గంప రాజశేఖర్ (34) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు, పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుజాతానగర్‌లో నివసిస్తున్న గంప రాజశేఖర్ ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరారు. గోపాలపట్నం ఆల్వార్ దాస్ కళాశాల వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఆయన స్కూటీని ఢీకొట్టడంతో కిందకు పడిపోయారు. తలకు తీవ్ర గాయాలవడంతో ఘటనా స్థలిలోనే చనిపోయారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ప్రథమ స్థానమే లక్ష్యం

డాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ప్రథమ స్థానమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని, అందుకు నగర పౌరుల సహకారం ఎంతో అవసరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య పనుల పనితీరు పరిశీలించారు. సీతమ్మధార, డీఎల్‌బీ క్వార్టర్స్, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, మురళీనగర్, అంబేడ్కర్ కాలనీ, మర్రిపాలెం వుడా లే-అవుట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖ నగరానికి మొదటి స్థానం దక్కేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని వాకీటాకీ ద్వారా ఆదేశించారు. పలు ప్రాంతాల్లో వ్యర్థాలు, చెత్త కుప్పలు అధికంగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాటిని తొలగించాలని ఆదేశించారు. ఉదయం 7.30 గంటలకే మురళీనగర్ ప్రధాన రహదారిలో డస్ట్‌బిన్‌లో వ్యర్థాలు నిండి ఉండడాన్ని గమనించి స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. రోడ్డు మార్జిన్లలోనూ, మీడియన్‌లలోనూ వ్యర్థాలు లేకుండా చూడాలని, ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు, పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉండాలని సూచించారు.

బాలిక మృతిపై నేడు విచారణ

మహారాణిపేట : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల బాలిక మృతి చెందిందనే ఆరోపణలపై విచారణ కోసం కమిటీని నియమిస్తూ కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ 30న వైద్యులు జి.శిరీష, డాక్టర్ వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె కె.స్కందన (5) లోటస్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్ల చనిపోయినట్టు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ ఎ.పద్మజ, పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.రాజుతో కమిటీని శివానంద్ నియమించారు. ఈ కమిటీ సభ్యులు మంగళవారం విచారణ ప్రారంభిస్తారు.

రచ్చకెక్కిన కృష్ణా కళాశాల విద్యార్థులు

- యూనిఫాం విషయంలో జూనియర్లు, సీనియర్ల మధ్య ఘర్షణ
- ఇరు వర్గాలను ఆదుపులోకి తీసుకున్న ఎంవీపీ పోలీసులు
- తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ అనంతరం విడుదల



గాయలతో విద్యార్థి



కళాశాల ఎదురుగా కొట్టుకుంటున్న విద్యార్థులు

మద్దిలపాలెం / ఎంవీపీ కాలనీ : నగరంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం వీరంగం సృష్టించారు. యూనిఫాం విషయంలో నెలకొన్న చిన్నపాటి సమస్యపై గొడవకు దిగి రచ్చకెక్కారు. రెండు వర్గాలుగా విడిపోయిన పదుల సంఖ్యలోని విద్యార్థులు కళాశాల లోపల నుంచి కొట్టుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. రోడ్డుపై వారు సృష్టించిన వీరంగానికి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో కళాశాల యాజమాన్యం, స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అల్లరి మూకలను పోలీసులు చెదరగొట్టారు. అనంతరం గొడవకు దిగిన రెండు వర్గాల విద్యార్థులను ఎంవీపీ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రణరంగాన్ని తలపించిన కళాశాల ప్రాంగణం

వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఒకరు యూనిఫాం వేసుకోకుండా సోమవారం తరగతికి హాజరయ్యాడు. గత కొన్ని రోజులుగా యూనిఫాం తప్పనిసరి చేస్తూ యాజమాన్యం ప్రకటన చేసింది. అయినప్పటికీ ఓ విద్యార్థి యూనిఫాం వేసుకోకుండా రావడంతో యూనిఫాం వేసుకొని రావాలంటూ బయటకు పంపించేశారు. అయితే యూనిఫాం వేసుకోవడానికి వెళ్లకుండా ఆ విద్యార్థి కళాశాల ప్రాంగణంలోనే తిరుగుతుండటంతో సీనియర్ ఇంటర్ విద్యార్థులు ప్రశ్నించారు. దీంతో వారి మధ్య చిన్నపాటి ఘర్షణ ప్రారంభమై జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే స్థాయికి వెళ్లింది. వారు దాడులు చేసుకుంటూ కళాశాల బయటకు వెళ్లి రోడ్డుపై కొట్టుకున్నారు. మరలా విచక్షణారహితంగా కొట్టుకుంటూ కళాశాల లోపలికి వచ్చి భయానక వాతావరణాన్ని సృష్టించారు. అయితే యూనిఫాం వేసుకోకుండా కళాశాలకు వస్తున్న జూనియర్ విద్యార్థులను సీనియర్లు ఏడిపిస్తున్నారని... ఈ విషయాన్ని ఓ జూనియర్ విద్యార్థి తన తండ్రికి చెప్పడంతో ఆయన సోమవారం కళాశాలకు వచ్చి సీనియర్ విద్యార్థుల తీరును వ్యతిరేకించారని తెలిసింది. ఈ క్రమంలో ఆగ్రహంతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారనే వాదన వినిపిస్తోంది.

మళ్లీ గొడవకు దిగితే క్రిమినల్ చర్యలు

ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలైనట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి గొడవలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతోపాటు వారితో బైండోవర్ రాయించి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే గొడవకు కారకులైన వారిపై చర్యలు తీసుకునేందుకు కళాశాల యాజమాన్యం సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

చేనేత కార్మికులకు సత్కారం

మహారాణిపేట : చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాకానినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కొనపల చినబాబు, పద్మనాభం మండలానికి చెందిన నక్కిన భోగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ, డెవలప్‌మెంటు ఆఫీసర్ రమణమ్మ పాల్గొన్నారు.